నమస్తే తెలంగాణ
వికారాబాద్
హైదరాబాద్, బుధవారం 28 మే 2025 VIKARABAD

# తడిసి..మొలకలొచ్చి..



శేరిగడ్డతండాలో అకాల వర్షానికి మొలకెత్తిన కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన ధాన్యం

- అకాల వర్షానికి తడిసి ముద్దవుతున్న కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం
- కొనుగోళ్లు సక్రమంగా సాగక.. ఆందోళనలో అన్నదాత

ధారూరు, మే 27 : మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శేరిగడ్డతండా, జీడిగడ్డతండా, గురుదొట్ల, నాగారం, నాగసముందర్, మోమిన్‌కలాన్, గట్టేపల్లి, రాంపూర్‌తండా తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచిన ధాన్యం తడిసిపోయింది. కేంద్రాల నిర్వాహకులు వడ్లను తూకం వేయకపోవడంతో అన్నదాతలు వడ్ల కుప్పల వద్దే రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు.
వడ్లను ఆరబెట్టి.. కొనుగోలు కేంద్రానికి తీసుకొద్దామంటే సరిపడా సంచులు అందుబాటులో లేవని.. అవి వచ్చే వరకు తీసుకురావద్దని సూచిస్తున్నారు. అంతేకాకుండా తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించకపో వడంతో అకాల వర్షానికి తడిసి మొలకలు వస్తున్నాయని.. పంట నీటిపాలు అవుతుండడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శేరిగడ్డతండాలో కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

మంత్రి పదవి కోసం మల్‌రెడ్డి యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ఈ అంశం తెరపైకి వచ్చిందే తడవుగా చలో హస్తిన అంటూ నియోజకవర్గాన్ని వదిలి వెళ్లడం రంగారెడ్డికి పరిపాటిగా మారింది. ఇందులో భాగంగా తాజాగా మరోసారి మంత్రివర్గంపై ఢిల్లీ అధిష్ఠానం కసరత్తు మొదలుపెట్టిందనే వార్త రాగానే మల్‌రెడ్డి 'మళ్లీ హస్తినకు పోయి రావలె' అన్నారు. గత ఐదారు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసిన ఆయన చివరకు తనకు మద్దతుగా కొందరు కీలక నియోజకవర్గ నాయకుల్ని కూడా అక్కడికి పిలిపించుకున్నారు. ఎలాగైనా రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రివర్గంలో బెర్త్ ఖరారు చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అవకాశాలు ఫిఫ్టీ.. ఫిఫ్టీ.. గానే ఉన్నాయని సీనియర్ నేతలే చెబుతుండడంతో జాబితా విడుదల తర్వాత నియోజకవర్గ రాజకీయం మరింత ఆసక్తికరంగా మారనుందనే చర్చ ఊపందుకున్నది.
–సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/రంగారెడ్డి, మే 27 (నమస్తే తెలంగాణ)

- ఢిల్లీలోనే మకాం వేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి
- మంత్రివర్గంలో బెర్త్ కోసం ఎక్కే గడప.. దిగే గడప
- అమెరికా మాజీ అధ్యక్షురాలి సిఫార్సు మొదలు రాజీనామా అస్త్రం ప్రయోగం
- మద్దతుగా నియోజకవర్గ నాయకులను ఢిల్లీకి పిలిపించుకున్న మల్‌రెడ్డి

# మళ్లీ హస్తినకు పోవలె..!

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరిస్థితి ఎక్కే గడప.. దిగే గడప.. అన్నట్లుగా తయారైంది. పార్టీలో సీనియర్ అయిన తనకు ఆదిలోనే మంత్రివర్గంలో అవకాశం దొరుకుతుందని ఆశించిన ఆయనకు నిరాశే ఎదురైంది. కానీ, ఇంకా నాలుగు స్థానాలు ఖాళీగా ఉండడంతో ఆది నుంచి బెర్త్ ఖరారు కోసం చేయని ప్రయత్నమంటూ లేదు. ప్రస్తుతం మంత్రివర్గంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాధాన్యమైతే లేదు. కానీ శాసనసభ స్పీకర్‌గా ప్రసాద్‌కుమార్ ఉన్నారు. పైగా గ్రేటర్ హైదరాబాద్ నుంచి కూడా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు. ఉప ఎన్నికలో కంటోన్మెంట్ నుంచి శ్రీగణేశ్ గెలిచినప్పటికీ ఆయన మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో రంగారెడ్డి జిల్లా సానుకూలతతోపాటు గ్రేటర్ హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న నియోజకవర్గం కావడం, అంతకుమించి సీనియర్ నేత కావడం... ఇవన్నీ వాస్తవానికి తనకు కలిసిరావాల్సిన అంశాలే అనే భావన ఆయనలో ఉన్నది. కానీ, సామాజిక సమీకరణాల్లో... మరో కారణమో... ఎక్కడో తేడా కొడుతుందనే అనుమానం కూడా బలంగానే ఉన్నది.
దీంతో ఆది నుంచీ మంత్రివర్గంలో బెర్త్ కోసం ఆయన విశ్వ ప్రయత్నాలే చేస్తున్నారు.



## ఔర్ ఏక్ ధక్కా..!

మంత్రివర్గంలో స్థానం కోసం మల్‌రెడ్డి మరోసారి యుద్ధమే మొదలుపెట్టినట్లు తెలుస్తున్నది. ఈ మేరకు వారం రోజులుగా ఢిల్లీలోనే మకాం వేశారు. ఎక్కే గడప.. దిగే గడప.. అన్నట్లుగా ఆయన ప్రయత్నాల్ని ముమ్మరం చేశారు. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు అనే సంకేతాలు వెలువడుతుండడంతో చివరి ప్రయత్నమే మరింత 'గట్టి'గానే చేయాలనుకుంటున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చినప్పటికీ మల్‌రెడ్డి మాత్రం అక్కడే ఉండి తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అంతేకాదు... రెండో రోజుల కిందట నియోజకవర్గంలోని కీలక నేతలు పలువుర్ని వెంటనే ఢిల్లీకి రావాల్సిందిగా కూడా ఆయన ఆదేశించడంపై నియోజకవర్గంలో తీవ్ర చర్చ జరుగుతున్నది. అయితే ఢిల్లీకి వెళ్లిన నాయకులకు ఇప్పటివరకైతే మల్‌రెడ్డి కలవకున్నా... మీరైతే ఇక్కడే ఉండండి అని మాత్రం ఫోన్‌లో సూచించినట్లు తెలిసింది. దీంతో ఏ సమయంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకే ఆయన అనుచరులను పిలిపించుకున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## ఒక్కో అస్త్రాన్ని పరీక్షించినా..!

ముఖ్యంగా గతంలో రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిగా దీపాదాస్ మున్షీ ఉన్నప్పుడు కాస్త 'గట్టి'గానే ప్రయత్నాలు చేశారు. ఆమె నుంచి భరోసా రావడంతో ఇక బుగ్గకారులో తిరగడమే తరువాయి అనుకున్నారు. కానీ, ప్రతిసారి మంత్రివర్గ విస్తరణ వాయిదా పడడం.. ఇదే క్రమంలో దీపాదాస్ మున్షీ స్థానంలో మీనాక్షీ నటరాజన్ రావడంతో మల్‌రెడ్డి పరిస్థితి కాస్త గందరగోళంగానే మారింది. దీంతో ఆయన సన్నిహితులతోపాటు రాష్ట్ర పార్టీ పెద్దలకు సైతం తాను గతంలో చేసిన 'గట్టి' ప్రయత్నాల తీరును ఏకరువు పెట్టుకొని వాపోయినట్లు సమాచారం. అనంతరం తన ప్రయత్నాలు మరింత ముమ్మరం చేసి చివరకు అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ దాకా తన పైరవీలను విస్తరించడం ఆ సందర్భంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయినప్పటికీ అటు అధిష్ఠానం... ఇటు రాష్ట్ర పెద్దల నుంచి ఎలాంటి భరోసా లభించలేదు. ఇక లాభం లేదనుకుని... కొంతకాలం కిందట బహిరంగంగానే రాజీనామా అస్త్రాన్ని సైతం ప్రయోగించారు. తన సామాజిక వర్గమే తనకు అడ్డుగా ఉంటే... తాను రాజీనామా చేసి నియోజకవర్గం నుంచి బీసీ నేతను గెలిపించుకుంటానని కూడా వ్యాఖ్యానించి మంత్రి పదవిపై తనకున్న బలమైన ఆకాంక్షను వెల్లడించారు. ఇంత చేసినా.. ఎటు నుంచి కూడా ఆయనకు భరోసా దొరకడంలేదని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఇక... పొరుగు నల్లగొండ జిల్లా రాజకీయాల్ని సైతం తనకు అనుకూలంగా మలుచుకునేందుకు మల్‌రెడ్డి తెర వెనక పావులు కదిపారనే వ్యాఖ్యలు పార్టీ నుంచి వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే సీనియర్ నేత జానారెడ్డి ఏకంగా పార్టీ అధిష్ఠానానికి రాసిన లేఖ కూడా సంచలనమైంది. రాష్ట్రంలో కీలకమైన రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని జానారెడ్డి తన లేఖలో అధిష్ఠానానికి సూచించడం మల్‌రెడ్డి ఆశలకు రెక్కలు తొడిగినట్లయింది.

# అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు

- తాండూరులో వారం రోజుల్లో 220 రిజిస్ట్రేషన్లు
- సాధారణంగా ప్రతిరోజూ 8 నుంచి 12 వరకే
- ఇదంతా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ (జూనియర్ అసిస్టెంట్) తతంగమే
- ఫసియుద్దీన్ సస్పెండ్



తాండూరు, మే 27 : తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అనుమతులు లేని ప్లాట్లకు అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ నెల 12 నుంచి 18 వరకు ఏడు రోజుల్లోనే 220 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. అంతకు ముందు ఏప్రిల్ 22 నుంచి మే 9 వరకు వందకు పైగా జరిగినట్లు తెలిసింది. సాధారణంగా ప్రతిరోజూ 8 నుంచి 12 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగేవి. తాండూరు పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే, ఏప్రిల్ 22 నుంచి మే 18 వరకు సాయికుమార్ వివాహం కోసం సెలవులో ఉన్నారు. కాగా, ఏప్రిల్ 22 నుం చి మే 9 వరకు వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచే స్తున్న పవన్ తాండూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతల్లో కొనసాగారు. ఈయన తన సోదరుడి వివాహమంటూ నెల రోజులపాటు సెలవు పెట్టా రు. దీంతో, చంపాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే ఫసియుద్దీన్ మే 12 నుంచి 18 వరకు తాండూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సమయంలో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు నిబంధనలకు విరుద్ధంగా డీటీసీపీ లేని లేఅవుట్లలోని 220 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశారు. ఏ రోజు రిజిస్ట్రేషన్ జరిగితే అదే రోజు డాక్యుమెంట్లను స్కానింగ్ పూర్తి చేయాలి. అయితే, పెద్ద ఎత్తున డాక్యుమెంట్ల స్కానింగ్ పెండింగ్‌లో ఉండడం.. సెలవుల్లో ఉన్న ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సాయికుమార్ విధుల్లో చేరడంతో నిబంధనలకు విరుద్ధంగా చేసిన ప్లాట్ల విషయం బయటపడింది. ఫసియుద్దీన్ అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు జరిగేందుకు సహకరించినట్లు ఆరోపణలు రావడం తో ఉన్నతాధికారులు అతడిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ వ్యవహారంలో కొందరు డాక్యుమెంట్ రైటర్లు కీలక పాత్ర పోషించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయడంలో ఇంకా ఎవ రెవరూ ఉన్నారో తెలుసుకునేందుకు పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశించినట్లు సమాచారం. తాండూరులో అనుమతి లేని లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపో వడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

# అన్నదాత అరిగోస..

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం

రంగారెడ్డి, మే 27 (నమస్తే తెలంగాణ) : ఈ యాసంగిలో వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అరకొర కొనుగోలు కేంద్రాలు సక్రమంగా కొనసాగడం లేదు. కష్టించి పంటను పండించి..తేమ శాతం లేకుండా చేసేందుకు కల్లాల్లో ఆరబెట్టి స్థానికంగా ఉన్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి తీసుకెళ్దామంటే..అక్కడి సిబ్బంది సరిపడా గన్నీ బ్యాగు లు లేవని.. అవి వచ్చిన తర్వాతే ఇస్తామని.. అప్పటివరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావద్దని సూచిస్తున్నారు. దీంతో అన్నదాతలు ఆ వడ్లను కల్లాల్లోనే రోజుల తరబడిగా ఉంచుతూ.. కాపలా కాస్తున్నారు. కాగా జిల్లాలో వరి కోత లు పూర్తయ్యాయి. ఈ సీజన్‌లో జిల్లాలో 2,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశా రు. అందుకనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. కేవలం 40 మాత్రమే కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసి.. కొనుగోళ్లను ప్రారంభించారు. అయితే, హమాలీల కొరతతోపాటు.. సరిపడా సంచులు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో ధాన్యాన్ని సేకరించడం లేదు. కేంద్రాల్లో కొనుగోళ్లు సక్రమంగా సాగకపోవడంతో అన్నదాతలు ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచుతున్నారు. మరోవైపు అకాల వర్షాలు అన్నదాతను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉదయం వరకు ధాన్యాన్ని ఆరబెట్టగా.. సాయంత్రం సమయంలో వర్షం కురిసి తడిసిపోతుండడంతో అన్నదాత పరిస్థితి ఆందోళనక రంగా మారింది. కొనుగోలు కేంద్రాల్లో ఆ ధాన్యాన్ని తూకం వేయకపోవడంతో .. మళ్లీ ఆరబెట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది. గత మూడు రోజులుగా కురుస్తున్న వానలతో ఆమనగల్లు, కడ్తాల్, మంచాల, ఇబ్రహీంపట్నం, యాచారం, మాడ్గుల తదితర మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పెద్ద ఎత్తున తడిసి ముద్దయింది. అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో... తూకం వేసిన వడ్లను ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించకపోవడంతో తడిసిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని అన్నదాతలు ఆందోళన బాటపడుతున్నారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సోమవారం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేపట్టగా.. బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపి రోడ్డుపై బైఠాయించిన విషయం తెలిసిందే.

### జిల్లాలో సేకరించింది 18 వేల మెట్రిక్ టన్నులే..

జిల్లాలో ఈ యాసంగిలో కేవలం 18,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం సేకరించింది. అయితే, జిల్లాలో ఈసారి 2,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా.. ప్రభుత్వం కేవలం 18,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేయడంతో అన్నదాతలు చాలా నష్టపోయారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటి నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూనే ఉన్నది. సరిపడా సంచులు, హమాలీ కొరత వంటి కారణాలను చెబుతూ రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించలేదు. దీంతో వేలాది మంది అన్నదాతలు కొనుగోలు కేంద్రాల్లో కాకుండా మధ్య దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోయారు.



నందిగామలో మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

# ఆదుకొమ్మంటే.. అరెస్టులా..?

- పరిగి నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు
- పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పెండింగ్ బిల్లులను చెల్లించాలని అడిగితే పోలీసులతో మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయించడం దారుణమని పలువురు మండిపడ్డారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిగి నియోజకవర్గంలో పర్యటన నేపథ్యంలో మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరడంతోపాటు.. ఆయన పర్యటనను అడ్డుకుంటారనే సాకుతో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాలకు తరలించడం దారుణమన్నారు.



పోలీసుల అదుపులో బాబురావు

## బిల్లులు అడిగితే అక్రమ అరెస్టా..?

కొందుర్గు : పెండింగ్ బిల్లులు అడిగితే పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం సరికాదని సర్పంచ్‌ల సంఘం చౌదరిగూడ మండలాధ్యక్షుడు బాబురావు అన్నారు. మంగళవారం బాబురావును పోలీసులు అదుపులోకి తీసుకోగా.. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించి బిల్లులను అడిగితే అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు.





పోలీసుల అదుపులో ఉన్న కులకచర్ల మాజీ సర్పంచ్‌లు

## అభివృద్ధి పనులు చేపట్టి.. అప్పుల పాలయ్యాం..

కులకచర్ల : పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగితే అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడం దారుణమని చాపలగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, అంతారం తండా మాజీ సర్పంచ్ రవిలాల్, బిందెంగడ్డతండా మాజీ సర్పంచ్ తుల్జానాయక్, ఘనాపూర్ మాజీ సర్పంచ్ గోపాల్, ఎత్తుకాల్వతండా మాజీ సర్పంచ్ లోక్యానాయక్ అన్నారు. రాష్ట్రంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి అప్పుల పాలు అయ్యామని.. వాటిని చెల్లించాలని కోరితే ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించ డం తగదన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిగి నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరడంతోపాటు.. ఆయన పర్యటనను అడ్డుకుంటారనే సాకుతో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి కులకచర్ల ఠాణాకు తరలించడం దారుణమన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు తమ పోరాటం ఆగదన్నారు.

## ముందస్తు అరెస్టులు తగవు

దోమ : ముందస్తు అరెస్టులను నిలుపుదల చేసి మాజీ సర్పంచ్‌లకు న్యాయం చేయాలని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం పోలీసులు రాజిరెడ్డిని అరెస్టు చేసి హైదరాబాద్‌కు వెళ్లొద్దని ఆదేశించారు.



దోమలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

## పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

నందిగామ : పెండింగ్ బిల్లులను చెల్లించాలని అడిగితే పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడం దారుణమని సర్పంచ్‌ల సంఘం రంగా రెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు జిల్లెల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం మండలంలోని ఆయా గ్రామాల బీఆర్ ఎస్ పార్టీ మాజీ సర్పంచ్‌లు, వెంకట్‌రెడ్డిని నందిగామ పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో సర్పంచ్‌ల సంఘం మండల ఉపాధ్యక్షుడు గోవింద్ అశోక్ తదితరులు ఉన్నారు.

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..

ఇబ్రహీంపట్నం : పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టినా ఇప్పటికీ ప్రభుత్వం పెండింగ్ బిల్లులను చెల్లించలేదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాయపోల్ మాజీ సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి, తులేకలాన్ మాజీ సర్పంచ్ యాదగిరి అన్నారు. మంగళవారం మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి పోలీసులు ఇబ్రహీంపట్నం ఠాణాకు తరలించగా.. వారు అక్కడ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ.1200 కోట్లను వెంటనే చెల్లించాలన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచ్‌ల పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు.

# కేటీఆర్‌కు నోటీసులు కాంగ్రెస్ కుట్రే..

బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్



వికారాబాద్, మే 27 : ఫార్ములా–ఈ కారు రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈ నెల 28న విచారణకు రావాలని ఏసీబీ మరోసారి నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కేటీఆర్ తన షెడ్యూల్ ప్రకారం విదేశీ పర్యటనలకు వెళ్లాలని ఇప్పటికే సామాజిక మాధ్యమంలో వెల్లడించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ నెలాఖరులో ఆయన అమెరికా వెళ్లి డల్లాస్‌లో జరుగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంతోపాటు బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో పాల్గొంటారన్నారు. అలాగే, లండన్‌లో జరుగను న్న పలు కీలక కార్యక్రమాల్లోనూ పా ల్గొననున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో లేకున్నా కేటీఆర్ పర్యటన ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నదని.. దానిని చూసి ఓర్వలేని కాంగ్రెస్ పాలకులు..ఆయన్ను అక్కడికి వెళ్లకుండా ఆపేందుకు.. ఆ పర్యటనలను రద్దు చేయించాలని కుట్రపూరితంగా ఏసీబీతో నోటీసులు జారీ చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కేటీఆర్‌ను ఏసీబీ ప్రత్యేక బృందం సుదీర్ఘంగా విచారించిందని.. ఇది పూర్తిగా డమ్మీ కేసు అని తేలిపోయిందన్నారు. అయినప్పటికీ ఇలాంటి సమయంలో ఏసీబీ నోటీ సులు జారీ చేయడంతో కేసు పూర్తిగా రాజకీయ వేధింపుల కోసమే పెట్టినట్లుగా మరోసారి స్పష్టమవుతున్నదని ఆయన పేర్కొన్నారు.